## 317 పశ్చాత్తాప ప్రేరేపణ

రా – ముఖారి తా–ఆది

పాపము దలంచు సుమీ – పశ్చా – త్తాపముఁ బొందు సుమీ = దాపని యేసుని పాదంబులబడి – పాపము వీడు సుమీ ॥పాపము॥

1. పాపము చేయకు మీ – యేసుని – గాయము రేపకుమీ = పాయక పాపము చేసిన మనసా – కాయఁడు యేసు సుమీ ॥పాపము॥
2. గంతులు వేయకుమీ – యేసుని – చెంతకుఁ జేరు సుమీ = వింతఁగఁ గ్రీస్తుని రక్షణ్యామృత – బిందువుఁ గోరు సుమీ ॥పాపము॥
3. ఈ ధరన్నమ్మకుమీ – ఆత్మకు – శోధన లుండు సుమీ = శోధన మాన్పెడు క్రీస్తును నమ్మి శ్రద్ధగ నుండు సుమీ ॥పాపము॥
4. తెగువఁ బోరాడు సుమీ– రిపునకు – బెగ్గిలవద్దు సుమీ = తెగువగు ప్రార్థన ఖడ్గమునుఁ బట్టి – పగతునిఁ గెల్వు సుమీ ॥పాపము॥
5. అంతము వచ్చు సుమీ – రక్షణ – అంతలో వెదకు సుమీ =అంత రంగుఁ దగు క్రీస్తు రక్షకుని – చెంతను జేరు సుమీ ॥పాపము॥

– యెషయా వీరమార్టిన్

## 318 పాపపు టొప్పుకోలు

రా –హరికాంభోజి తా–త్రిపుట

పాపినయ్యా – నేఁ – బాపి నయ్యా – కాపాడ వయ్యా – పాపభారము నుండి – పాపు మయ్యా – నన్నుఁ – పాపభారమునుండి – పాపు మయ్యా ॥పాపి॥

1. కావుమయ్యా – ననుఁ – గావు మయ్య నా – పావ నయ్యా – జీవమైన యేసు – నీ వే నయ్యా నా జీవమైన యేసు – నీవే నయ్యా ॥పాపి॥
2. ప్రాపు నీవు – నా ప్రాపు నీవు న – న్నోపినావు – నా పాలిదైవమా – నన్నుఁ గావు –మో – నా పాలి దైవమా – నన్నుఁ గావు ॥పాపి॥



3. ఏల వయ్యా – న – న్నేల వయ్యా – మేలియ్య వయ్యా – చాల నమ్మితిఁ గరుణా – శాలి వయ్యా – నేఁ – జాల నమ్మితిఁ గరుణా – శాలి వయ్యా ॥పాపి॥
4. మంటివాఁడ – నే – మంటివాఁడ న – న్నొంటి వీడ కె –న్నంటి కైన ని – న్నంటువాఁడ – నే నె – న్నంటికైన ని – న్నంటువాఁడ ॥పాపి॥
5. శాంతిపరచు – నను – శాంతిపరచు నీ – శాంత మిడుచు నా – సొంత మగు దనుక – చెంత నునుచు – నే నా – సొంత మగు దనుక – చెంత నునుచు ॥పాపి॥

–బేతాళ జాన్

## 319 ఆత్మ వంచన

రా – ధన్యాసి తా–ఆది

ఎఱింగి యెఱిఁగి చెడిపోతివి మనసా – యిఁక నీ దిక్కెవ్వరు చెపుమా = దురితం బిది స – చ్ఛరితం బిది యని – యెరుక సరకు గొన – కేమియు నీ ॥యెఱిఁగి॥

1. ఇది దేవుని దయ యిది క్రీస్తుని ప్రియ –మిది విమలాత్ముని గుణ మనుచు = ఎదలో ననుభవ – మెఱింగి మరల దు – ర్మదమున దుష్కృత – పదమున బడితివి ॥యెఱిఁగి॥
2. సకలముఁ జూచెడు దేవుని కంటికిఁ – జాటుగ జరిగెడి పని యేది = ఇఁక జెవి గుసగుస – లెల్లను దిక్కులఁ బ్రకటముఁ జేసెదు–ప్రభు వున్నాఁడని ॥యెఱిఁగి॥
3. ఎన్నిమార్లు సిలువను వేయుచుఁ ప్రభు – యేసుని వెతబడఁ జేసెదవు= తిన్నని మార్గము – తెలిసియుండి నీ – కన్నుల గంతలు – గట్టితి వయ్యో ॥యెఱిఁగి॥
4. గద్దించెడు మనస్సాక్షికి గడ – గడ లాడక పోతివి నీవు =హద్దుమీరి దై–వాజ్ఞలు ద్రోయుచు – నెద్దు లాగు పరు – గెత్తితి వయ్యో ॥యెఱిఁగి॥
5. పలువిధ శోధన బాధలలో ఘన – ప్రభు క్రీస్తుడె నీ దిక్కునుకో తాళుచు బశ్చాత్తాపముపడి యిక – జాలించుము కలు – షపు యత్నంబు ॥యెఱిఁగి॥